సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 31, ఆగస్టు, 2022



చిట్టి చేతుల్లో మట్టి గణపతి

వినాయకుడి మట్టి విగ్రహం చిన్నారుల చేతుల్లో చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా మంగళవారం పలు పాఠశాలల్లో మట్టి వినాయక విగ్రహాల తయారీపై శిక్షణ కార్యక్రమం జరిగింది. సెంటర్‌స్ప్రెడ్‌లో..

ఆంత్రాక్స్‌పై అప్రమత్తం

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటస్వామి
- 13 గ్రామాల్లో 15 ప్రత్యేక బృందాలతో ఆంత్రాక్స్ వ్యాక్సినేషన్ కార్యక్రమం

3లో



సిద్ధమైన ఘనపతి

- గాజువాకలో 89 అడుగుల వినాయకుడి విగ్రహం
- లంకా మైదానంలో 18 రోజుల పాటు పూజలు
- ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ



సెంటర్‌స్ప్రెడ్‌లో..



రద్దీగా ఉన్న పాడేరు మెయిన్ రోడ్డు

గణపతిం భజేహం

- జిల్లా అంతటా చవితి సందడి
- కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట
- పూలు, పండ్ల ధరలకు రెక్కలు

విఘ్నాలను తొలగించి, సర్వశుభాలను ప్రసాదించే గణనాథుని ఘనంగా పూజించేందుకు ప్రతి మది ఉవ్విళ్లూరుతోంది. వినాయకచవితి ఉత్సవాలకు ఊరూవాడా సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మండపాల్లో బహురూపాల్లో ప్రతిష్టించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చవితి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలుదారులతో మంగళవారం మార్కెట్లు రద్దీగా మారాయి.

- 8లో



గణనాథుని విగ్రహాలు

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం 17,704మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయగా 6,007 మంది ఉత్తీర్ణులయ్యారు. 9,100 మంది బాలురులో 2,884 మంది, 8,604 మంది బాలికల్లో 3,123 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 32 శాతం, బాలికలు 36 శాతంమంది ఉత్తీర్ణత పొందారు. రెండో సంవత్సరంలో 14,123 మంది పరీక్షలు రాయగా 4,319 మంది ఉత్తీర్ణులయ్యారు. 7,866మంది బాలురులో 2,215 మంది, 6,257 మంది బాలికల్లో 2,104 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 28 శాతం, బాలికలు 34 శాతం ఉత్తీర్ణులయ్యారు.మొత్తంగా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 34 శాతం, రెండో సంవత్సరంలో 31 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐవో ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం 1,961 మందిలో 969 మంది, రెండో సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో 1 794 మందిలో 824 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

లూసం పాఠశాల ఉపాధ్యాయుడు సస్పెన్షన్



ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడంతో బయట ఉన్న విద్యార్థులు (ఫైల్)

కొయ్యూరు: మర్రివాడ పంచాయతీ లూసం జీపీఎస్ (టీడబ్ల్యూ) పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.పాపారావును గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు మంగళవారం సస్పెండ్ చేశారు. పాఠశాలలు తెరచిన నాటి నుంచి ఆయన విధులకు హాజరు కావడం.దీనిపై ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ పలుమార్లు ఆయనకు సమాచారం ఇచ్చినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఉపాధ్యాయుడు విధులకు రావడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.దీనిపై విచారణ నిర్వహించిన ఏటీడబ్ల్యూవో పూర్తి వివరాలతో డీడీకి నివేదిక అందజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీడీ ఆదేశాలు జారీ చేశారు. ఆ ఉపాధ్యాయుడి స్థానంలో సీఆర్‌టీని నియమించారు. పాపారావు యూ.చీడిపాలెం పంచాయతీ రేవులకోట జీపీఎస్(టీడబ్ల్యూ) పాఠశాలలో మిగతా 2వ పేజీలో ▶

కేజీహెచ్‌లో అవినీతిపై కమిటీ!

- వైద్యం, పోస్టుమార్టంలకు లంచం డిమాండ్ చేస్తున్నారన్న సభ్యులు
- అధికారుల తీరుపై జెడ్పీటీసీ సభ్యుల అసహనం
- ఇకపై అజెండా అంశాలపై సమగ్ర చర్చ
- ప్రశాంతంగా సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం





సమావేశంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్లు డాక్టర్ మల్లికార్జున(విశాఖపట్నం), రవి సుభాష్ పఠాన్ చెట్టి(అనకాపల్లి), సభకు హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేజీహెచ్‌లో జరుగుతున్న అవినీతిపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చనీయాంశమైంది. అక్కడ వైద్యం, పోస్టుమార్టంలకు వైద్యులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తున్నారంటూ సభ్యులు ఆరోపణలు గుప్పించారు. దీనిపై సమగ్ర విచారణకు ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ) ప్రిన్సిపాల్ నేతృత్వంలో కమిటీని వేస్తున్నట్టు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. మంగళవారం జెడ్పీ హాలులో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్య, వైద్యారోగ్యం, జలజీవన్ మిషన్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, మంచి నీటి పథకాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి వైద్యం చేయడానికి కేజీహెచ్‌లో ఓ డాక్టర్ లంచం డిమాండ్ చేశారని, ఆ సొమ్ము చెల్లించాకే వైద్యం అందించారని, స్వాక్షాత్తూ తనకే ఈ అనుభవం ఎదురైందని మునగపాక జెడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణ చెప్పారు. అలాగే పోస్టుమార్టానికి కూడా బాధితుల నుంచి మార్చురీ సిబ్బంది సొమ్ము డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇలా లంచం ఇచ్చాకే వైద్యులు పోస్టుమార్టం చేస్తున్నారని పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆరోపించారు. ఇది వాస్తవమేనని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్పందించిన కలెక్టర్ మల్లికార్జున ఏఎంసీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కమిటీని వేసి విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేశామని, రాత్రి వేళల్లోనూ శవపరీక్షలు చేసేలా సిబ్బందిని నియమించామని తెలిపారు.

అధికారులు ఫోన్ ఎత్తడం లేదు?

జెడ్పీటీసీ సభ్యులకు జిల్లా అధికారులు విలువ ఇవ్వడం లేదని, ఏ సమస్యపైనైనా ఫోన్ చేస్తే ఎత్తడం లేదని బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఏరియా/ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేయడం లేదని కె.కోటపాడు, నర్సీపట్నం జెడ్పీటీసీలు అనురాధ, ఎస్.రమణమ్మ సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సంక్షేమ శస్త్రచికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, నర్సుల కొరత సమస్యను తీర్చాలని అనకాపల్లి ఎంపీపీ సూరిబాబు కోరారు. దీనిపై అనకాపల్లి కలెక్టర్ రవి సుభాష్ పఠాన్‌శెట్టి మిగతా 2వ పేజీలో ▶

టీచర్లు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు

ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల టీచర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి చెప్పారు. కొయ్యూరు మండలం బంగారంపేట పాఠశాలను సందర్శించినప్పుడు టీచర్ రాకపోయినా వచ్చి వెళ్లినట్టు చెప్పారన్నారు. ఏజెన్సీలో విధులు సరిగా నిర్వహించని 376 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, బంగారంపేట టీచర్‌పై చర్య తీసుకుంటామని ఏఎస్సార్ జిల్లా డీఈవో రమేష్ చెప్పారు.

దివ్యాంగులకు రుణ సౌకర్యం

- 6లో

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గెస్ట్ టీచర్ల మెరిట్‌లిస్టులో అభ్యంతరాల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గెస్ట్ టీచర్ల రిక్రూట్‌మెంట్ మెరిట్ లిస్టులో అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్టు ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించి ఈ విద్యాసంవత్సరానికి గెస్ట్ టీచర్ ప్రాతిపదికన టీజీటీ, పీజీటీ పోస్టులకు గతంలోనే నోటిఫికేషన్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతలు, మార్కులను బట్టి మెరిట్ లిస్టు తయారు చేశామని, ఈ జాబితాలో అభ్యంతరాలుంటే ఆయా అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో నేరుగా అరకులోయ గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలో సంప్రదించాలని పీవో సూచించారు. మెరిట్ లిస్టును కూడా హెచ్‌టీటీపీఎస్://ఐటీడీఏపాడేరు.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీఎస్://ఏపీటీఆర్ఐబిఇఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని, వాటిని ఆయా అభ్యర్థులు పరిశీలించుకోవచ్చని పీవో తెలిపారు.

క్లుప్తంగా...

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్ : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ (సీఎంఎం) ఎన్.పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు వాసుపల్లి ఎర్రయ్య ఆనందపురం మండలం నాగయ్యపాలెం నివాసి. గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేసేవాడు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు. 2018 మార్చి 28న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతాన్ని సందర్శించడానికి వచ్చారు. ఆ సమయంలో ఎర్రయ్య కూడా అక్కడికి వచ్చాడు. పూటుగా మద్యం సేవించి... అక్కడ శాంతి భద్రతలు పరిరక్షించే విధుల్లో ఉన్న పోలీసు అధికారి వెంకటరావుపై తిరగబడ్డాడు. విధులకు ఆటంకం కలిగించాడు. ఈ నేపథ్యంలో వెంకటరావు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు



నుర్మతిలో వెలసిన వాల్‌పోస్టర్

జి.మాడుగుల: మావోయిస్టుల బూటకపు మాటలు నమ్మి గిరిజనులు జీవితాలను నాశనం చేసుకోవద్దని అల్లూరి గిరిజన స్ఫూర్తి సంఘం కోరింది. మండలంలో మద్దిగరువు,నుర్మతి,సూరిమెట్ట, జి.మాడుగులలో సోమవారం రాత్రి 'గిరిజన యువత భవిత' అల్లూరి గిరిజన స్ఫూర్తి సంఘం పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలిశాయి. పోలీసు శాఖ కల్పిస్తున్న ఉచిత శిక్షణను వినియోగించుకుని ఉద్యోగం పొందిన గిరిజన యువత మావోయిస్టుల కల్లబొల్లి మాటలు విని ఆ పార్టీలో చేరి జీవతాలు నాశనం చేసుకున్నట్టు పేర్కొంటూ ఫొటోలతో వాల్ పోస్టర్‌ను అతికించింది. పోలీసుశాఖ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను వినియోగించుకొని మీరు అభివృద్ధి చెంది మీ గ్రామాలను, కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని మీ గిరిజన సహోదరులుగా కోరుకుంటున్నామని వాల్ పోస్టర్‌లో అల్లూరి గిరిజన స్ఫూర్తి సంఘం పేర్కొంది.

బుల్లయ్య ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట(విశాఖ ఉత్తర): వరంగల్‌లో జరిగిన పోటీల్లో బుల్లయ్య కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు వరంగల్‌లో ఆంధ్రా, తెలంగాణ ఎన్‌సీసీ యూనిట్లకు ఇంటర్ గ్రూప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన ఇంజినీరింగ్, డిగ్రీ యూనిట్ల నుంచి 11 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. వీరిలో కె.జీవన్ రఘురామరెడ్డి ఫైరింగ్‌లో కాంస్య పతకం, బి.సందీప్ రైఫిల్ ఫైరింగ్‌లో కాంస్య పతకం సాధించారు. వీరు సెప్టెంబర్ 24 నుంచి రాజస్థాన్‌లో జరగనున్న క్యాంప్‌లో పాల్గొంటారు. ఎన్‌సీసీ విశాఖ యూనిట్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రతిభ చూపిన క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

లోన్‌యాప్స్ విష వలయంలో చిక్కుకోవద్దు

- మాయలో పడితే నిర్వాహకుల గుప్పిట్లోకి వ్యక్తిగత సమాచారం
- నగర పోలీస్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్
- లోన్‌యాప్ ఉచ్చులో పడిన విశాఖ మహిళ
- వేధింపులు భరించలేక పోలీసులకు ఫిర్యాదు
- విచారణలో చైనా నుంచి యాప్ నెట్‌వర్క్ సాగుతున్నట్లు గుర్తింపు
- వారికి కడపకు చెందిన జయసింహారెడ్డి సహకరిస్తున్నట్లు నిర్ధారణ
- రూ.100 కోట్లు మేర లావాదేవీలు జరిగినట్లు తేల్చిన పోలీసులు



మాట్లాడుతున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఆన్‌లైన్ లోన్ యాప్స్ మాయలో పడి ఇబ్బందులకు గురి కావద్దని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ప్రజలకు సూచించారు. లోన్‌యాప్ ద్వారా తీసుకున్న రుణానికి రెట్టింపునకు మించి చెల్లించినప్పటికీ మహిళను వేధిస్తున్న యాప్ ఏజెంట్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. నగరానికి చెందిన మహిళ ప్లేస్టోర్ నుంచి 'షటిల్ లోన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఈ ఏడాది మే నెలలో రూ.5 వేలు రుణం కోసం అప్‌లై చేసింది. మరుసటి రోజు ఆమె ఖాతాలో రూ.3,850 జమ చేశారు. రుణం తిరిగి చెల్లించేందుకు మూడు రోజులు గడువు ఇచ్చినప్పటికీ... నిర్వాహకులు వెంటనే రూ.12 వేలు చెల్లించాలని వేధించడం ప్రారంభించారు. దీంతో ఆమె రెండు విడతల్లో రూ.5 వేలు, రూ.7 వేలు చొప్పున మొత్తం రూ.12 వేలు చెల్లించేసింది. ఇంకా డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో ఆమె ఫొటోలు మార్ఫింగ్ చేసి వాట్సాప్ కాంటాక్ట్స్‌కు పంపిస్తామని బెదించారు. దీంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చైనా నుంచి నెట్‌వర్క్

పోలీసులు విచారించగా ఆమెకు వచ్చిన ఫోన్‌కాల్స్, వాట్సాప్ లొకేషన్స్ నేపాల్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లి దర్యాప్తు చేసే అవకాశం లేకపోవడంతో ఆమె రుణం జమ చేసిన అకౌంట్‌ను పరిశీలించారు. అది హైదరాబాద్‌లోని కెనరా బ్యాంకులో ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో బ్యాంకు అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ అకౌంట్ కడపకు చెందిన రాజు జయసింహారెడ్డిదిగా గుర్తించారు. దీంతో అతడిని హైదరాబాద్‌లోనే అదుపులోకి తీసుకొని విచారించారు. అతడు చైనాకు చెందిన కెవిన్ అనే లోన్‌యాప్స్ నిర్వాహకుడికి సహకరిస్తున్నట్లు తెలుసుకున్నారు. అలాగే అతడి పేరు మీద 11 ఫర్మ్ అకౌంట్స్, 16 బ్యాంకు కరెంట్ అకౌంట్లు ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆ అకౌంట్ల ద్వారా రూ.100 కోట్లు మేర లావాదేవీలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో జయసింహారెడ్డికి రూ.1.15 కోట్లు మేర చైనా నిర్వాహకుల నుంచి లబ్ధి చేకూరినట్లు పోలీసులు గుర్తించారు. అతడి అకౌంట్‌లో ఉన్న రూ.కోటిని సీజ్ చేశారు.

అనేక అనుమానాలు

ఈ కేసులో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఫర్మ్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే జీఎస్టీ అవసరముంటుంది. జీఎస్టీకి దరఖాస్తు చేసుకుంటే సదరు అధికారులు ఆ సంస్థ ఎక్కడుందో తెలుసుకొని స్వయంగా పరిశీలించి జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేస్తారు. కానీ ఎటువంటి కార్యాలయమూ లేకుండా 11 సంస్థల పేరు మీద జీఎస్టీ రిజిస్ట్రేషన్లు ఉండడం గమనార్హం. అలాగే బ్యాంకు అకౌంట్ల ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతున్నప్పటికీ.. సంబంధిత బ్యాంకు అధికారులకు అనుమానం రాకపోవడం విశేషం. అలాగే ఆదాయ పన్ను శాఖ అధికారులు కూడా ఈ లావాదేవీలపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. ఈ లావాదేవీలను హుడా అనే పేమెంట్ గేట్‌వే ద్వారా నిర్వహిస్తుండడంతో నగదును ఫ్రీజ్ చేసే అవకాశం లేకుండా పోయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లోన్‌యాప్ మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ యాప్ బాధితుల సంఖ్య విపరీతంగా పెరుగుతోందని, ఇప్పటికే రాష్ట్రంలో ఇద్దరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారని తెలిపారు. యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న సమయంలోనే మన వ్యక్తిగత సమాచారం నిర్వాహకుల గుప్పిట్లోకి వెళ్లిపోతుందన్నారు. ఈ లోన్‌యాప్ ద్వారా ఎవరైనా డబ్బులు పోగొట్టుకున్న బాధితులు ఉంటే వారు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, వారికి జయసింహారెడ్డి నుంచి సీజ్ చేసిన నగదును ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకొని ఛేదించిన సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్, సిబ్బంది బి.శ్రీనివాసరావు (ఏఎస్‌ఐ), బి.చంద్రశేఖర్ (పీసీ), ఎం.సతీష్(పీసీ)లను అభినందించారు.

చవితి ఉత్సవాలపై ఆంక్షలు లేవు

చవితి ఉత్సవాలపై ఆంక్షలు లేవని సీపీ శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఎప్పటిలాగే మండపం, మైక్‌ల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని చెప్పారు. సోమవారం సాయంత్రానికి 1,450 మండపాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఒక్క దరఖాస్తును కూడా తిరస్కరించలేదన్నారు. భద్రతా వైఫల్యాలకు తావులేకుండా నిబంధనలు, పోలీసుల సూచనలు పాటించాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా భక్తులు ఉత్సాహంగా వినాయక ఉత్సవాలు చేసుకోవాలని సూచించారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వీరభద్ర స్వామి జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగమ సేవా సంఘం, ఉమానీలకంఠేశ్వర స్వామి ధర్మకర్తల మండలి, ఆధ్యాత్మిక సేవా బృందం ప్రతినిధులు వీరభద్ర స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


వీరభద్ర స్వామి విగ్రహం


వీరభద్ర స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించిన ఆలయ ధర్మకర్తలు, జంగమ సేవా సంఘం కుటుంబాలు

కేజీహెచ్‌లో అవినీతిపై కమిటీ!

▶ 1వ పేజీ తరువాయి

మాట్లాడుతూ జిల్లాలో ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైందని, త్వరలోనే ఈ ఖాళీలు భర్తీ అవుతాయని చెప్పారు. పీహెచ్‌సీల్లో పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు అందుబాటులో లేవని దీనివల్ల ప్రాణాపాయ పరిస్థితులేర్పడుతున్నాయని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని పీహెచ్‌సీల్లో పాముకాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని ఉపముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యం

సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పేదల వైద్యానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. అవసరమైన అందరికీ ఉచిత వైద్యం అందించాలన్నారు. అలాగే జలజీవన్ మిషన్‌లో ఇంటింటికి మంచినీటి కుళాయిల ఏర్పాటు వేగంగా జరుగుతోందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు తరచూ ప్రభుత్వ స్కూళ్లలో తనిఖీలు నిర్వహించి విద్యార్థుల సమస్యలను కలెక్టర్, డీఈవోల దృష్టికి తీసుకురావాలని కోరారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా తెలుసుకున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, పీవీఎన్ మాధవ్, అల్లూరి జిల్లా జేసీ జె.శివశ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ సీఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత, పోక్సో చట్టాలపై అవగాహన


కాంస్య పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి, అధ్యాపకులు

సాక్షి,పాడేరు: రహదారి భద్రతా నియామాలు, వాహన నిబంధనలు యువత పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని పాడేరు సీఐ బి.సుధాకర్ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం-1,2 యూనిట్ల ఆధ్వర్యంలో రహదారి భద్రత, పోక్సో చట్టం, కెరీర్ గైడెన్స్‌పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ఎస్‌ఐ జి.లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎస్.రసూల్, అధ్యాపకులు ధర్మారావు, గౌరీశంకర్ పాల్గొన్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ స్టేట్ మీట్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థి నాయుడు సింహాచలం ప్రతిభ చూపాడు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎస్.రసూల్ అభినందించారు.

లూసం పాఠశాల ఉపాధ్యాయుడు సస్పెన్షన్

▶ 1వ పేజీ తరువాయి

ఐదుసంవత్సరాల పాటు విధులు నిర్వహించారు. అక్కడ కూడా ఆయన విధులకు డుమ్మా కొట్టేవారు. పలుమార్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆయన జీతాలు నిలిపివేశారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పాపారావు రేవులకోట నుంచి లూసంకు బదిలీ అయ్యారు. ఈవిషయమై ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్తుల ఫిర్యాదుపై విచారణ నిర్వహించి డీడీకి నివేదించామన్నారు.డీడీ ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారని తెలిపారు.

ఆంత్రాక్స్‌పై అప్రమత్తంగా ఉండండి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటస్వామి
- 13 గ్రామాల్లో 15 ప్రత్యేక బృందాలతో ఆంత్రాక్స్ వ్యాక్సినేషన్ కార్యక్రమం



లక్ష్మీపురంలో ఆంత్రాక్స్ వ్యాక్సినేషన్ పర్యవేక్షిస్తున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి



దొరగూడకు మందులు, వ్యాక్సినేషన్ కిట్లు మోసుకొని వెళ్తున్న పశువైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు : ఆంత్రాక్స్ వ్యాధి అత్యంత ప్రమాదకరం అని ఈ వ్యాధి పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జి.వెంకటస్వామి అన్నారు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామంలో పలువురికి ఆంత్రాక్స్ లక్షణాలు వెలుగు చూడడంతో అప్రమత్తం అయిన జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు లక్ష్మీపురం పంచాయతీలోని దొరగూడ గ్రామం చుట్టూ ఉన్న 13 గ్రామాల్లో పశువులకు, మేకలకు, గొర్రెలకు 15 ప్రత్యేక బృందాలతో 70 సిబ్బందితో ఆంత్రాక్స్ వ్యాక్సినేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వెంకటస్వామి పర్యవేక్షణలో దొరగూడ, బిరిగూడ, మోంజపుట్టు, జబడ, గర్రం, తుమిడిపుట్టు, కర్లాపొదర్, మెట్టగూడ, సుత్తిగూడ, సంగంవలస, కొడాపుట్టు, ఉబ్బేగుల, లక్ష్మీపురం గ్రామాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1660 ఆవులు, 84 గేదెలకు, 382 గొర్రెలు,620 మేకలకు ఆంత్రాక్స్ వ్యాక్సిన్ అందించడం జరిగిందన్నారు. వ్యాధుల బారిన పడి మృతి చెందిన జీవాలను తినడం చేయరాదని, గ్రామానికి దూరంగా పూడ్చాలని రైతులను కోరారు. వ్యాధులతో పశువులు ఉంటే వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. గిరిజన రైతులకు పశు సంవర్ధకశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, చైతన్యం తెచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పెదబయలు పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రాజారవికుమార్, పశువైద్యాధికారులు భాస్కర్‌రావు, సీనయ్య, సతీష్, సౌజన్యదేవి, కుసుమ ప్రియదర్శిని, రవి, చరణ్, చలిని, రాజాశ్రీ, పాల్గొన్నారు. కాగా దొరగూడ గ్రామంలో మూడురోజులుగా ముంచంగిపుట్టు పశు వైద్యాధికారి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పశు సిబ్బంది మాకాం వేశారు. పశువులకు వ్యాక్సినేషన్ చేశారు. అత్యంత ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులను దాటుకొని మందులు,వ్యాక్సినేషన్ కిట్లు మోసుకొని కొండ, అడవి ప్రాంతం గుండా సాహసోపేతమైన ప్రయాణం చేశారు. ఊట నీటినే తాగుతూ, గెంజి అన్నమే తిని విధులు నిర్వహించారు. ఆదివారం వెళ్లిన పశువైద్య సిబ్బంది మంగళవారం సాయంత్రానికి అతి కష్టంమీద ముంచంగిపుట్టు చేరుకున్నారు. వీరిని పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులతో పాటు మండల ప్రజాప్రతినిధులు అభినందించారు.

క్లుప్తంగా...

రూ.2 లక్షల విలువైన బంగారం చోరీ

పాయకరావుపేట : పట్టణంలో గల పండరీపురంలో నివాసం ఉంటున్న సురేష్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు నక్కపల్లి సి.ఐ. నారాయణరావు తెలిపారు. సురేష్ కుటుంబ సభ్యులతో 27 వ తేదీన బంధువుల ఇంటికి వెళ్ళారన్నారు. తిరిగి మంగళవారం ఇంటికి రాగా ఇంటి తలుపులు తాళాలు తెరిచి ఉండడంతో ఇంటి లోపలికి వెళ్ళి పరిశీలించగా గదిలో బీరువాలో వున్న సుమారు రూ. 2 లక్షలు విలువైన బంగారు వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించారన్నారు. ఈమేరకు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సకాలంలో వైద్యం అందక పసికందు మృతి

తల్లిదండ్రుల ఆరోపణ

సీలేరు: జి.కె.వీధి మండలం దారకొండ పంచాయతీ ములసల వీధి గ్రామానికి చెందిన పద్మ నిండు గర్భిణి. ఈమెకు పురిటినొప్పులు రావడంతో దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఏఎన్‌ఎంకు మంగళవారం సాయంత్రం సమాచారం అందించారు. ఆ సమయంలో అంబులెన్సు రావడానికి ఆలస్యమైంది. దీంతో పద్మ ఇంటి వద్దే ఆడ బిడ్డను ప్రసవించింది. అయితే కొద్ది సేపటికే శిశువు మృతి చెందింది. వైద్యాధికారి, ఏఎన్‌ఎం సకాలంలో స్పందించకపోవడంతోనే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో అంబులెన్సు, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యాధికారి ప్రైవేటు వాహనంలో తీసుకువస్తే వైద్య సేవలు కల్పిస్తామని తెలిపినట్లు బంధువులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

చనిపోయాడనుకున్న కొడుకు తండ్రి చెంతకు..

- మతిస్థిమితం లేక నాలుగేళ్లుగా ఇంటికి దూరం
- శ్రద్ధ ఫౌండేషన్ సహకారంతో సొంత గూటికి



తండ్రి చెంతకు చేరిన శ్యామ్‌రావ్ లోఖండే

అల్లిపురం (విశాఖ దక్షిణ): చనిపోయాడు అనుకున్న కొడుకు తిరిగి వస్తే ఆ ఆనందం వర్ణనాతీతం. అలాంటి అనుభవం ఒక తండ్రికి కలిగింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని చింద్వారా గ్రామానికి చెందిన శ్యామ్‌రావ్ లోఖండే (38) మతిస్థిమితం లేకపోవడంతో నాలుగేళ్ల క్రితం ఊరు వదిలి వచ్చేశాడు. అలా వచ్చిన వ్యక్తి నగరంలో తిరుగుతుండగా అతడిని భీమ్‌నగర్ ఏయూటీడీ, టీఎస్ఆర్ కాంప్లెక్స్ నిరాశ్రయ వసతి గృహం సిబ్బంది రక్షించి, మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్స పొందుతూ ఈ ఏడాది జనవరి 31న పూర్తి ఆరోగ్యవంతుడిగా డిశ్చార్జి అయ్యాడు. దీంతో ఆయనకు భీమ్‌నగర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. అతని వివరాలు తెలుసుకున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు స్వగ్రామం తీసుకెళ్లి తండ్రి ప్రవీణ్‌కు అప్పగించారు. చనిపోయాడనుకున్న శ్యామ్‌రావ్ తిరిగి రావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కవగుంటలో ముగ్గురికి డెంగ్యూ



గ్రామంలో వైద్యశిబిరంలో చికిత్సలందిస్తున్న వైద్యసిబ్బంది



గ్రామంలో డ్రైనేజీల్లో నెలకొన్న మురుగు నీరు

రావికమతం : కవగుంట గ్రామలో డెంగ్యు జ్వరాలు ప్రబలాయి. ఆ గ్రామానికి చెందిన డి.శశిదర్, ఆర్.వరహాలమ్మ,రేణం దేముడులకు విపరీతమైన జ్వరం, తలనెప్పి రావడంతో గ్రామంలో మందులు వాడినా తగ్గలేదు. రోజురోజుకు నీరసించిపోతుండడంతో కుటుంబీకులు అనకాపల్లి వైద్యాలయానికి, కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వారికి పరీక్షలు చేసి డెంగ్యూ జ్వరాలుగా నిర్ధారించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయాన్ని రావికమతం పీహెచ్‌సీకి సమాచారం అందించడంతో వైద్యాధికారి శ్రీనివాస్, సిబ్బందితో ఆ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి చికిత్సలు అందిస్తున్నారు. ఆ గ్రామ సర్పంచ్ దాసరి వరహాలు సూర్యకుమారి వారికి సహాయ సహకారాలందించారు.

మురుగునీటితో సావాసం...

రావికమతం : కవగుంట గ్రామంలో డ్రైనేజీలు మూసుకుపోవడం, మురుగు నీరు, వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి నిత్యం దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో ఆ గ్రామస్తులు నిత్యం దోమల బెడదతో ఇక్కట్లు పడుతున్నారు. గత నెలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ గ్రామం వచ్చిన ఎమ్మెల్యే ధర్మశ్రీకు ఆ గ్రామ సమస్యలు విన్నవించారు. డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు. అక్కడి అధ్వాన పరిస్థితులు చూసి స్పందించిన ధర్మశ్రీ డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. పనులు చేపట్టాల్సి ఉంది. కాగా గ్రామంలో డెంగ్యూ జ్వరాలు వెలుగు చూడడంతో రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి సిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. 50 మందికి ఓపీ నిర్వహించారు. వీరిలో జ్వరాలున్న 13 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు.

కొత్త ఎల్లవరంలో విషాదం

- ఇద్దరు మనవళ్ల మృతితో ఆగిన అమ్మమ్మ గుండె



చింతాలమ్మ (ఫైల్)



మృతి చెందిన అన్నదమ్ములు శివకుమార్, రాజ్‌కుమార్

గొలుగొండ: కళ్ల ముందే పుట్టి పెరిగిన మనవళ్లు ఇద్దరూ కన్నుమూయడంతో అమ్మమ్మ గుండె ఆగిపోయింది. ఒకే ఇంటిలో ముగ్గురు మరణించడంతో కొత్త ఎల్లవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన అన్నదమ్ములు రాజ్‌కుమార్ (30) , శివకుమార్ (26)ఎ తూర్పుగోదావరి జిల్లా తలుపులమ్మలోవకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. డి.పోలవరం వద్ద ఆదివారం వీరిని కారు ఢీకొనడంతో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా.. రాజ్‌కుమార్ విశాఖలో వైద్య సేవలు పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ వార్త విని తట్టుకోలేక అమ్మమ్మ చింతాలమ్మ గుండెపోటుతో చనిపోయింది. ముగ్గురి మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. రాజ్‌కుమార్ విశాఖ డాక్‌యార్డులో పనిచేస్తుండగా శివకుమార్ నర్సీపట్నం మండలం బలిఘట్టం సచివాలయంలో పనిచేస్తున్నారు.

నక్కపల్లి ఆర్‌ఐపై బదిలీ వేటు

కార్యాలయంలో అవినీతి ప్రక్షాళనకు చర్యలు



నక్కపల్లి తహీసీల్దార్ కార్యాలయం

నక్కపల్లి : విధులు సక్రమంగా నిర్వహించకపోవడం ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి పలు ఆరోపణలు రావడంతో మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న నర్సింగరావుపై బదిలీ వేటు పడింది. ఇతనిని మాకవారిపాలెం డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో ఇతన్ని బదిలీ చేయడం జరిగిందన్నారు. మరో ఆర్‌ఐ దీర్ఘకాలిక సెలవులో ఉండడం వల్ల అతనిపై ఇంకా చర్యలు తీసుకోలేదన్నారు. వివరాల్లోకి వెళ్తే ఇటీవల కాలంలో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి రోజు రోజుకు పెరుగుతోందని, ప్రతి పనికి రేటు నిర్ణయించి మామూళ్లు గుంజుతున్నారని అలాగే ఏపిఐఐసి వారు ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం సేకరిస్తున్న భూముల పరిహారం సిఫారసుల విషయంలో పలు అక్రమాలు జరిగాయంటూ ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సభ్యులు ఆరోపించారు. కార్యాలయంలో దళారులు తిష్టవేస్తున్నారని వారితో కార్యాలయ సిబ్బంది కుమ్మక్కయి లంచాలు గుంజుతున్నారని వీరి చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందంటూ పలువురు ఎంపిటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. మ్యూటేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాల జారీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీ, వెబ్‌లాండ్‌లో పేర్లు నమోదు వంటి వాటికోసం ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తోందని చేయి తడిపితేనే గాని పనులు జరగని పరిస్థితి నెలకొందంటూ సభ్యులు ధ్వజమెత్తారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, మండల సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది వ్యవహారంపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు కార్యాలయంలో ప్రక్షాళన మొదలుపెట్టారు. ఆర్‌ఐ నర్సింగరావుపై బదిలీ వేటు వేశారు. ఆయన స్థానంలో నాతవరం ఆర్‌ఐ మధును నియమించినట్టు సమాచారం. ఇటీవల కాలంలో డీఎల్ పురం సర్వే నంబర్ 190లో చెరువు గర్భంలో 5 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించి సాగు చేసుకుంటున్న వారిపేరున రూ.60లక్షలు పరిహారం ఇప్పించేందుకు ప్రతిపాదనలు పంపించిన ఉద్యోగిపై కూడా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సదరు ఉద్యోగి తనపై చర్యలు లేకుండా ఉన్నత స్థాయిలో పైరవీలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే బాధ్యులైన అందరిపై తీసుకోవాలని కేవలం ఒకరిద్దరిపై చర్యలు తీసుకోవడం సమంజసం కాదని బాధితులు అంటున్నారు. ఇలాగే గత ప్రభుత్వ హయాంలో రికార్డులు ట్యాంపరింగ్ చేసిన ఒక డీటీ, ఆర్‌ఐ, ఇద్దరు వీఆర్వోలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. మొత్తంమీద ఆర్‌ఐ బదిలీ చర్చనీయాంశమయింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదబయలు: ఓపెన్ స్కూల్ సొసైటీ 2022–2023 విద్యా సంవత్సరంలో టెన్త్,ఇంటర్ ప్రవేశాలు పొందవచ్చని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె. కృష్ణవేణి తెలిపారు. వచ్చేనెల ఐదోతేదీ లోపు ఎలాంటి రుసుం లేకుండా ప్రవేశం పొందవచ్చన్నారు. బడిమానిన, బడి బయట ఉన్న పిల్లలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. టెన్త్, ఇంటర్ ప్రవేశాలు పొందే విద్యార్థులు 14 ఏళ్ల పైబడి ఉండాలని కోరారు. వివరాలకు 6303583488, 8985636946లో సంప్రదించాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు రుణ సౌకర్యం

- వచ్చే నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి,పాడేరు : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ, ఏపీ విభిన్న ప్రతిభావంతులు,వయో వృద్ధుల సంస్థ ఆధ్వర్యంలో రుణాల సౌకర్యాన్ని అమలు చేస్తున్నామని ఈ సంస్థ జిల్లా సహాయ సంచాలకుడు సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. వంద మంది విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కరికి రూ.1లక్ష నుంచి రూ.5లక్షల వరకు స్వయం ఉపాధి పథకాలకు ఈ రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు 40 శాతం వికలాంగత్వానికి పైబడిన వారు కూడా అర్హులని ఆయన తెలిపారు. వయసు 18 నుంచి 60ఏళ్ల లోబడి ఉండాలని, బుద్ధిమాంద్యత గల వారు 14ఏళ్ల పైబడిన వారంతా ఈ రుణాలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. వచ్చేనెల15వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.ఈ రుణాలకు సంబంధించి ప్రాజెక్టు వ్యయం రూ.లక్ష దాటితే జిల్లా పరిశ్రమలశాఖ వారితో ఆమోదించబడిన ప్రాజెక్టు రిపోర్టును అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి పొందిన నిరంభ్యంతర సర్టిఫికెట్లను కూడా దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు. రూ.లక్ష వరకు రుణం కావాల్సిన వారికి రుణం మంజూరు తేదీ నాటి నుంచి ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన ప్రభుత్వ ఉద్యోగి జామీను కూడా ఉండాలని వివరించారు. రూ.లక్షకు పైబడిన రుణం కావాల్సిన వారికి రుణం మంజూరు తేదీ నుంచి పదేళ్ల సర్వీసు మిగిలి ఉన్న ప్రభుత్వ ఉద్యోగి జామీను ఉండాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను ఆయా మండలాల్లోని మండల పరిషత్ అధికారి లేదా సహాయ సంచాలకులు లేదా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ప్రాంగణం, పెదవాల్తేరు, విశాఖపట్నం వారికి వచ్చేనెల 15వ తేదీలోగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9441568462, 0891-2952585 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గిరిజనుల సేవలో ఏఎస్పీ కృషి అభినందనీయం

చింతపల్లి : గిరిజనులకు సేవలు అందించడంలో ఏఎస్పీ తుషార్ డూడి కృషి అభినందనీయమని సీఐలు శ్రీను, అశోక్‌కుమార్ పేర్కొన్నారు. కడప జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్తున్న తుషార్ డూడిని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఆయన సేవల పట్ల చింతపల్లి, జి.కె.వీధి, సీలేరు, అన్నవరం పోలీసులు అభినందనలు తెలిపారు. పోలీసుల పట్ల ఆయన చూపిన ఆదరాభిమానాలే గిరిజనుల్లో మంచి పేరు సంపాదించుకోవడానికి కారణమైందన్నారు. భవిష్యత్తులో తుషార్ డూడి ఆదర్శాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ అలీ పాల్గొన్నారు.


ఏఎస్పీ తుషార్ డూడిని సన్మానిస్తున్న పోలీసులు

విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే సరఫరా నిలిపివేత

చింతపల్లి : వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆ శాఖ డీఈఈ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గృహ, వ్యాపార సముదాయాల నిర్వాహకులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు ఆధార్, కులధ్రువీకరణ పత్రాలు సంబంధిత విద్యుత్ సిబ్బందికి అందజేయాలని, 200 యూనిట్ల వరకు ఉచితంగా సౌకర్యం పొందే అవకాశం ఉంటుందన్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, వినియోగదారులకు సమాచారం పంపుతున్నామని తెలిపారు. ఆన్‌లైన్, డిజిటల్ విధానం, ఆధార్, ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. మన్యంలో భారీ వర్షాల కారణంగా విద్యుత్ తీగలు స్తంభాలకు వేలాడుతున్నాయని, వాటిని బాగు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఈ వేణుగోపాల్

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

అరకులోయ : పద్మాపురం, కొత్తవలస, చింతపల్లి ఉద్యానవన కేంద్రాల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, బకాయి వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో మంగళవారం కార్మికులు అరకులోయ పద్మాపురం గార్డెన్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి పి.బాల్‌దేవ్ ఆధ్వర్యంలో హెచ్ఎన్‌టీసీ కార్మికులంతా తమ సమస్యలు పరిష్కరించాలని, 2021లో మూడునెలల బకాయి వేతనాలు చెల్లించాలని, 2010-11, 2011-12 ఆర్థిక సంవత్సరంలో కార్మికుల నుంచి వసూలు చేసిన ఈపీఎఫ్ నగదును తమ ఖాతాల్లో జమ చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని వారంతా నినాదాలు చేశారు. హెచ్ఎన్‌టీసీ కార్మిక సంఘ నేతలు పండు, డొంబు, జగ్గారావు, మంగ్గన్న, సీతారాం పాల్గొన్నారు.


పద్మాపురం గార్డెన్ వద్ద ధర్నా చేస్తున్న హెచ్ఎన్‌టీసీ కార్మికులు

పంపిణీకి సిద్ధంగా రాజ్‌మా విత్తనాలు

పాడేరు రూరల్: మండలంలో రైతులకు పంపిణీ చేసేందుకు 4,500కిలోల రాజ్‌మా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సూర్యకుమారి తెలిపారు. మినుములూరు, తుంపాడ, వంతాడపల్లి, గుత్తులపుట్టు, చింతలవీధి, దోకులూరు రైతు భరోసా కేంద్రాల్లో 500కిలోల చొప్పున, ఇరడాపల్లి, గొండెలి రైతు భరోసా కేంద్రాలకు కలిపి 1500 కిలోలు సిద్ధంగా ఉంచామని ఆమె వివరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 190 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,190	3,800
రెండో రకం	3,210	2,900
మూడో రకం	2,890	2,500

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు : ఎంపీ మాధవి



మట్టి గణనాథుని విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వెంకట్ తేజ

కొయ్యూరు: పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన ప్రతిమల వల్ల పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఏ ప్రతిమను పూజించినా ఒకే రకమైన ఫలితం వస్తున్నందున మట్టి విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. నిమజ్జన సమయంలో వెంటనే కరిగిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితం కోరే మట్టి ప్రతిమలను ఏర్పాటుచేసుకోవాలని ఆమె సూచించారు. ఆమె చవితి శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి,పాడేరు : వినాయక చవితి పండగతో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పాడేరు పట్టణంలోని యువతి వస్త్రాలయ యజమాని వెంకట్ తేజ అన్ని వర్గాల భక్తులకు ఉచితంగా 100 గణనాథుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో మణికంఠ అన్నదాన ట్రస్టు ప్రతినిధి శివరాత్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూడా భక్తులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. మోదకొండమ్మ తల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శివరాత్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అరకులోయ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ సూచన మేరకు మట్టి వినాయక విగ్రహాలను గిరిజన గ్రామాల్లో మంగళవారం పంపిణీ చేశారు. పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి దత్తత గ్రామాలైన సిమిలిగుడ, గద్యగుడ,స్వర్ణయిగుడ, కొత్త భల్లుగుడ, సిమిలిగుడ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టారు. అధ్యాపకులు ఎస్.రాజు, రైల్వేస్టేషన్ మాస్టర్ వి.బంగారయ్య పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చింతపల్లి, తాజంగి, అన్నవరం, లోతుగెడ్డజంక్షన్ వంటి ప్రధాన కూడళ్లలో భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

జి.మాడుగుల: స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం దువ్వాడ శ్రీకుసుమ హరనాథ్ నామ ప్రచార సంఘం, కేఎస్ఆర్ గ్రీన్‌వ్యాలీ అధ్వర్యంలో 30గ్రామాల ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను భీమిలి సద్గురు సేవా ఆశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ, ఎస్ఐ శ్రీనివాస్,ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్ రమేష్ అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ధర్మ ప్రచార ప్రతినిధులు మత్స్యరాస మత్స్యరాజు, రీమెలి అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.



జి.మాడుగులలో మట్టి విగ్రహాల పంపిణీ

ముంచంగిపుట్టు: మార్కెట్లకు చవితి సందడి నెలకొంది. పూజాసామగ్రి, విగ్రహాల కొనుగోళ్లు, చవితి మండపాల ఏర్పాట్లతో సందడి నెలకొంది.







వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని పాడేరు ఎమ్మెల్యే,పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దంపతులు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు నియోజకవర్గంలోని మండలాల ప్రజాప్రతినిధులు, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి మంగళవారం విశాఖలో మర్యాద పూర్వకంగా కలిశారు.

- సాక్షి, పాడేరు

క్లుప్తంగా...

ఎంపీడీవోగా శ్రీహర్షిత్



శ్రీహర్షిత్‌ను అభినందిస్తున్న సిబ్బంది

అనంతగిరి: ఎంపీడీవోగా శ్రీహర్షిత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఆయనకు ఆయనకు అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన రోజే ఆయన పుట్టిన రోజు కావడంతో వారు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభం



పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామంలో మంగళవారం నాడు–నేడు పథకం మంజూరైన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులకు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, పాలమామిడి సర్పంచ్ సురభంగి రామకృష్ణ ప్రారంభించారు. వార్డు సభ్యుడు పి మత్స్యరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతి, ప్రశాంత్, తాతారావు, సుమన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్ జ్యోతి, ఉపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు రాజ్‌మా విత్తనాల పంపిణీ



రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఉమామహేష్, సర్పంచ్ లక్ష్మి

గూడెంకొత్తవీధి : మండలంలోని రింతాడ రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న 90శాతం రాయితీ రాజ్‌మా విత్తనాలను మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఉమా మహేష్, స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి ఆధ్వర్యంలో ఆయా రైతులకు విత్తనాలు పంపిణీ చేపట్టారు. రూ.920ల ఖరీదు చేసే రాజ్‌మా విత్తనాలను రూ.220లకే పంపిణీ చేస్తుందని వారు పేర్కొన్నారు. ఆర్‌బీకేలో ఉద్యోగుల పనితీరుపై ఎంపీడీవో సమీక్షించారు. వర్మీకంపోస్టులను తనిఖీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యార్థినుల రిలే దీక్షలు

అరకులోయ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు నియమించి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాల్గవ రోజుకు చేరాయి. ఆదివాసీ జేఏసీ నేతలు రామారావుదొర, అరకులోయ నేతలు కిల్లో ఆనంద్, మహాదేవ్, నందో, మన్మధ, గిరిజన సంఘం నేత రామారావు, ఎస్ఎఫ్ఐ నేత సిమోన్ తదితరులు మద్దతు తెలిపారు. వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు.

వలంటీర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : మండలంలోని కిండంగి పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో కె. సాయి నవీన్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వచ్చేనెల మూడవ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదున దరఖాస్తుల పరిశీలన 6న ఇంటర్వ్యూలు, ఏడున నియామక ఉత్తర్వులు అందజేస్తామని ఆయన తెలిపారు.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పెదబయలు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీవో ఎస్.రాజ్యలక్ష్మీ తెలిపారు. మండలంలోని గిన్నెలకోట పంచాయతీ లండూలు,అరడకోట పంచాయతీ కాగువలస అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అదే గ్రామానికి చెందిన టెన్త్ పాసైన వచ్చేనెల 12లోగా దరఖాస్తు అందజేయాలని ఆమె కోరారు.

మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు..


గూడెంకొత్తవీధి : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ మినీ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీవో లక్ష్మీదేవి తెలిపారు.

పీకేగూడెంలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు స్థానికులై ఉండాలన్నారు. టెన్త్ ఉత్తీర్ణతతోపాటు 21 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. వచ్చేనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు

సాక్షి,పాడేరు : జిల్లా ప్రజలకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఐకు సత్కారం



ఎస్ఐను సత్కరిస్తున్న అప్పారావు, సూరిబాబు, కృష్ణ

కొయ్యూరు: ఎస్ఐ పి రాజారావును మంగళవారం డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు మంగళవారం సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నర్సి కృష్ణ,ఉల్లి సూరిబాబు సన్మానించారు.

గిరిజనుల శ్రమదానం

సాక్షి,పాడేరు : పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌లోని బోనంగమ్మ కొండకు పోయే మట్టి రోడ్డును అభివృద్ధి చేసేందుకు గిరిజనులు మంగళవారం శ్రమదానం చేశారు. కల్లాలబయలు, కొత్తవలస గ్రామాల గిరిజనులు శ్రమదానంతో గోతులను పూడ్చారు.

తాగునీటి కుళాయి ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుబ్బారి చంటమ్మ

హుకుంపేట: మండలంలోని మూలియపుట్టు పంచాయతీ కంగరు పుట్టు గ్రామంలో తాగునీటి కుళాయిన సర్పంచ్ చంటమ్మ మంగళవారం ప్రారంభించారు.

ఎంఈవోగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

గూడెంకొత్తవీధి : మండల విద్యాశాఖాధికారిగా చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పలు ఉపాధ్యాయ సంఘ నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించి అభినందనలు తెలిపారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి

డుంబ్రిగుడ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు సమష్టిగా పని చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరు పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి భవన్ ఆవరణలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంచి పెంట శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కృష్ణపుష్పం కనువిందు



రాజవొమ్మంగిలో కనువిందు చేస్తున్న కృష్ణపుష్పం

రాజవొమ్మంగి: స్థానిక ఎరువుల దుకాణం యజమాని వెంకటేశ్వర్రావు ఇంటి పెరటిలో అరుదైన కృష్ణపుష్పం కనువిందు చేస్తోంది. ఊదా తదితర రంగుల్లో కనుపించే ఈ పుష్పాన్ని కృష్ణ కమలం అని కూడా పిలుస్తుంటారు. రాఖీని పోలి ఉండే ఈ పూలంటే ఇష్టపడని వారుండరు. ఈ తీగ జాతి మొక్కను కడియం నర్సరీ నుంచి తీసుకొచ్చి ఓ పందిరి వేసి ఎంతో అపురూపంగా పెంచుతున్నారు. రోజూ ఈ తీగకు పూచే రంగు రంగుల పూలు అందర్ని ఆకట్టుకుంటున్నాయి.

కాలానికి అనుగుణంగా మెరుగుపడాలి



ఇంజినీరింగ్ విద్యార్థులతో రాజాకుమార్

అనకాపల్లి టౌన్: ప్రపంచాన్ని బ్రహ్మ సృష్టిస్తే, ఒక సివిల్ ఇంజినీర్ సమాజాన్ని సృష్టించాడని బొంబాయి యాఫ్‌కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ ఇంజినీర్ పి.రాజాకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలకు గేట్–2023పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక స్వచ్ఛంద సంస్థ ద్వారా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయన అందిస్తున్న పలు సేవలు గురించి వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతిభ కనబర్చాలని సూచించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ గురించి వివరించారు. కార్యక్రమంలో డైట్ స్టూడెంట్ కో ఆర్డినేటర్ హేమంత్ కుమార్, ప్రిన్సిపాల్ చల్లా నరసింహం, సివిల్ విభాగాధిపతి ఎస్.రాము పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక చేసిన జిల్లా జట్లతో సంఘు కార్యదర్శి విజయ్, హెచ్‌ఎం శ్రీనివాసరావు

నేటి నుంచి గణపతి నవరాత్రోత్సవాలు



నామవరంలో నాడీగణపతి ఆలయం



ఒడ్డిమెట్టలో లక్ష్మీగణపతి ఆలయం



స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హోమ గుండం

- ఒడ్డిమెట్టలో ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ శాఖ

నక్కపల్లి: కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతున్న ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి నవరాత్రులు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం ఐదు గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఒడ్డిమెట్టలో కైలాస గిరిపై లక్ష్మీగణపతి స్వయం వ్యక్తమై వెలిశారు. ఏటా వినాయక చవితి నాడు ఇక్కడ పెద్ద తిరునాళ్లు జరుగుతోంది. జిల్లా నలు మూలల నుంచి భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ కాంప్లెక్స్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాధారణ దర్శనంతోపాటు, ప్రత్యేక ప్రవేశ దర్శనం కోసం క్యూ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను కార్యనిర్వాహణాధికారి వెంకటాద్రి, ఆలయ చైర్మన్ పయిల సూరిబాబు, సర్పంచ్ నర్సింహమూర్తి తదితరులు మంగళవారం పరిశీలించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం ఘనంగా జరుగుతుందన్నారు. ఏ కార్యక్రమం తలపెట్టినా ముందుగా ఒడ్డిమెట్ట వినాయకుడ్ని తలచుకుని చేపడితే దిగ్విజయంగా పూర్తవుతుందనేది భక్తుల నమ్మకం.

నామవరం నాడీ గణపతి ఆలయంలోను ఉత్సవాలు ...

నామవరంలో వెలసిన నాడీ గణపతి ఆలయంలోనూ గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ రహదారి పక్కన ఈ ఆలయం ఎంతో పురాతనమైంది. కుర్తాళ పీఠాధిపతి మౌన స్వామితో ఇక్కడ గణపతి విగ్రహం ప్రతిష్టబడిందని పూర్వీకుల కథనం. ఇక్కడ వినాయకుడికి నాడీ కొట్టుకుంటుందనేది కుర్తాళం పీఠాధిపతులు నిర్ధారించారని స్థానికులు చెబుతుంటారు. మౌన స్వామి ప్రతిష్టించిన వినాయక విగ్రహాలు, శివలింగాలు దేశంలో మరో 11 ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం. 1912లోనే ఈ విగ్రహ ప్రతిష్ట జరిగినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. మర్రిచెట్టు మొదలులో ఈ విగ్రహానికి చిన్నపాటి ఆలయం నిర్మించారు. ఇక్కడ నాడీ గణపతి ఆలయానికి వచ్చి మొక్కుకున్న కోర్కెలు నెరవేరితే 11 బిందెలు నీటితో స్వామివారికి అభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడా గణేష్ నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట

సాక్షి,పాడేరు: జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో వినాయక చవితి సందడి నెలకొంది. ఈ ఏడాది అన్ని చోట్ల భారీ గణనాథుని విగ్రహాలను వ్యాపారులు అందుబాటులో తెచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చిన్న సైజు మట్టి విగ్రహాలను విక్రయించారు. పూజా సామగ్రి, విగ్రహాల కొనుగోలుదారులతో పాడేరు పాత బస్టాండు, సినిమాహాల్ సెంటర్, కాంప్లెక్సు రోడ్డు, మెయిన్ రోడ్డు, స్టేట్ బ్యాంక్ ఏరియా, శ్రీనివాస లాడ్జి, మసీదు సెంటర్లలో అన్ని దుకాణాల వద్ద మంగళవారం రద్దీ నెలకొంది. గణనాథుని విగ్రహాలతోపాటు పూజ, కిరాణా సామగ్రి వ్యాపారం భారీగా జరిగింది. పూలు, పండ్ల ధరలు చుక్కలనంటాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తమ మండపాల్లో కొలువుదీర్చేందుకు పాడేరులో వినాయక విగ్రహాలు కొనుగోలు చేసి వాహనాల్లో తీసుకువెళ్లారు. చింతూరు ఐటీడీఏ పరిధిలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్ పురం మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో భారీగా వ్యాపారం జరిగింది. గతంలో కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ కారణాల వల్ల చవితి ఉత్సవాలను నిరాడంబరంగా నిర్వహించారు. ఈ ఏడాది భారీగా ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం

చోడవరం: వినాయక నవరాత్రోత్సవాలకు ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వినాయకుడికి ప్రీతికరమైన రోజు బుధవారమే వినాయక చవితి రావడంతో ఆలయం భక్తులతో మరింత రద్దీగా మారనుంది. దీంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయం లోపల పూర్తిగా పూలతో అలంకరణ చేశారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, కొడమంచిలి చలపతిరావుల ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేస్తారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు.



పాడేరులో గణపతి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న గిరిజనులు



పాడేరు మార్కెట్‌లో పూల దుకాణం వద్ద మహిళలు



పలు రకాల పత్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

రామాలయానికి రూ. 40 లక్షల స్థల విరాళం

- దాత రోమాల మూలరాజుకు అభినందన

రాంబిల్లి: వెంకటాపురంలో రామాలయం నిర్మాణానికి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రోమాల మూలరాజు రూ. 40 లక్షల విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఇక్కడ రామాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని పునర్నిర్మించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ప్రస్తుతం రామాలయ స్థలం చిన్నదిగా ఉండటంతో మూలరాజు ముందుకొచ్చి ఆరు సెంట్లు స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. అతని ఉదార స్వభావాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



రామాలయ నిర్మాణానికి ఇచ్చిన స్థలం (ఇన్‌సెట్) దాత మూలరాజు

జాతీయ స్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థికి ప్రశంసా పత్రం ఇస్తున్న యోగా స్పోర్ట్స్ ప్రతినిధులు

పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 47వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థి బండారు దేవాన్ష్‌నాయుడుతి ప్రథమ బహుమతి సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 28 నుంచి 31 వరకు పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్ పూర్‌లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొననున్నాడని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

అనకాపల్లి జిల్లా సెపక్ తక్రా జట్టు ఎంపిక

- 10న పశ్చిమ గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు (కిక్ వాలీ బాల్) అనకాపల్లి జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం జరిగింది. సీనియర్, సబ్ జూనియర్ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు సెపక్ తక్రా సంఘం జిల్లా కార్యదర్శి విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. ఈ పోటీలు సరికొత్తగా ఉండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

పశ్చిమ గోదావరి జిల్లా దొమ్మేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 10 నుంచి 12 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ జట్ల ఎంపిక ప్రక్రియలో పెదనందిపల్లి హెచ్‌ఎం, పీడీ పి. శ్రీనివాసరావు, పీడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.